క్లుప్తంగా

వరికుచ్చులను మెచ్చుకున్నారు..



పరిశీలిస్తున్న ఐఏఎస్‌లు

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికల సమయంలో డీఆర్‌డీఓ, మహిళా సమాఖ్యలు చేసిన వరికుచ్చులు ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించేందుకు వచ్చిన ప్రత్యేకాధికారి, నీటిపారుదలశాఖ కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్‌నూ వరికుచ్చులు ఆకట్టుకున్నాయి. నిర్మల్ రూరల్, సోన్ మండలాల్లో పర్యటించిన ఆయనకు కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సమక్షంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి వరికుచ్చులను అందించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన ఆయన మెచ్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుంటాల: మండలంలోని బూరుగుపల్లి(కే) 132కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ, కుంటాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం ఏడు నుంచి ఉదయం 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అందుబాటులో సోయా, కంది విత్తనాలు

ముధోల్: మండల కేంద్రంలోని ఏరువాక వ్యవసాయ పరిశోధన స్థానం కార్యాలయంలో సోయా, కంది పంట విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు శాస్త్రవేత్త డాక్టర్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. కంది రకం విత్తనాలు డబ్ల్యూఆర్‌జీ 97, హనుమ టీయండ్ ఆర్‌జీ–4 నాలుగు కేజీల బస్తా ధర రూ. 600, ఆరు కేజీల బస్తా ధర రూ.900, సోయాబిన్ బాసర రకం 25 కేజీల బస్తా ధర రూ.2750 ఉందన్నారు. కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని ప్రచారం



బోరిగాంలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

తానూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తానూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని బోరిగాం, బోల్సా, బెల్‌తరోడా, ఎల్వి, హంగిర్గా గ్రామాల్లో ప్రచారం చేశారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా తానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందాలని పేర్కొన్నారు. అధ్యాపకులు నరేశ్, లక్ష్మణ్, విజయ్, నగేశ్, సందీప్ ఉన్నారు.

ఘనంగా పడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయ 9వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి గురుస్వామి పాపారావు, పురోహితులు శరత్‌చంద్ర శర్మ, వెంకటేశ్‌శర్మ, నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో పదునెట్టాంబడి పడిపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న, గౌరవాధ్యక్షుడు కొత్తపెల్లి సురేశ్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నర్సాపూర్(జి): మండలకేంద్రం శివారులో విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని గొర్రొల్ల రాజు అనే రైతుకు చెందిన ఆవు మేత కోసం శివారు ప్రాంతంలోకి వెళ్లింది. అక్కడ తక్కువ ఎత్తులో విద్యుత్ సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని నష్ట పరిహారం ఇవ్వాలని బాధిత రైతు అధికారులను వేడుకున్నాడు.
22ఎండీఎల్102: జీలుగ విత్తన బస్తాలు

అందుబాటులో జీలుగ విత్తనాలు

కుంటాల: వానాకాలంలో వరి సాగు చేసే రైతుల కోసం కుంటాల పీఏసీఎస్ కార్యాలయంలో అవసరమయ్యే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో సోమలింగారెడ్డి, సీఈవో నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల బస్తా ధర రూ.2,790 కాగా రాయితీ పోను రూ.1,116కు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లు తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు.

ఆక్రమణలు.. అవస్థలు

- నిర్మల్‌లో రోడ్డుపైనే దుకాణాల ఏర్పాటు
- పనిచేయని సిగ్నళ్లు, వాహనదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



ఎన్టీఆర్ మినీ స్టేడియం సమీపంలో రోడ్డుపై పండ్ల దుకాణాలు, ఆగి ఉన్న వాహనాలు



ఓల్డ్ బస్టాండ్ ఏరియాలో దుకాణాల ముందు వాహనాలు నిలుపడంతో జామ్ అయిన ట్రాఫిక్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రమైన నిర్మల్‌లో కొందరు చిరువ్యాపారులు ఇరువైపులా రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. కొందరు పోటీపడి వ్యాపారాన్ని రోడ్లపైకి తీసుకొచ్చారు.. కానీ దుకాణాల వద్ద పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్లపైనే ఉంచుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం పనుల నిమిత్తం నిర్మల్‌కు వచ్చే వారితోపాటు పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. బల్దియా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

అదుపు లేని ఆక్రమణలు..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల పక్కన మలుపుల వద్ద కొన్ని రోజులు చిన్న టేబుల్ వేసి చిరువ్యాపారం మొదలుపెడతారు. ఎవరు అడ్డు చెప్పకుంటే నెలకే చిన్నపాటి షెడ్డు ఏర్పాటు చేసుకుంటారు. ఆ తర్వాత కొద్దిరోజులకు శాశ్వతంగా రేకులషెడ్డు వేసుకుంటారు. ఫుట్‌పాత్ దాటి రోడ్డుపై దాకా తమ వస్తువులను తెచ్చి పెట్టేస్తారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు మొదలవుతాయి. ఈ తతంగమంతా మున్సిపల్, పోలీసుల కళ్ల ఎదుటే జరుగుతుండటం గమనార్హం.

పార్కింగ్‌కు చోటేది..

జిల్లా కేంద్రంలో ఏ షాపునకు వెళ్లినా.. పార్కింగ్‌కు చోటు ఉండటం లేదు. పార్కింగ్‌కు స్థలం లేకుండానే పెద్ద కాంప్లెక్స్‌ల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతి ఇస్తున్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తుంటే పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు.సెట్ బ్యాక్ తీసుకోకుండా పార్కింగ్‌కు స్థలం వదలకుండా నిర్మాణం చేపడుతుంటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పనిచేయని సిగ్నల్స్..

పట్టణంలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత బల్దియాదే. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిగ్నల్స్ ఏర్పాటు చేసి దాని నిర్వహణ పోలీస్‌శాఖకు అప్పగించే బాధ్యత మున్సిపల్‌దే. కానీ జిల్లా కేంద్రంలో కొన్ని కూడళ్ల వద్ద సిగ్నల్స్ నెలలుగా పనిచేయడం లేదు. ఒక్క చౌరస్తాలోనూ పూర్తిస్థాయిలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు లేదు. దెబ్బతిన్న వాటికి కూడా మరమ్మతులు చేయించడం లేదు.

పెరుగుతున్న వాహనాలు..

వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వాహనాల్లో వచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. నిర్మల్‌లోనే ద్విచక్ర వాహనాల సంఖ్య 1,12,066.. కార్లు 12,810, ఆటోలు 6,573 ఉన్నాయి. వీటితోపాటు భారీ వాహనాలు నిర్మల్‌కు రాకపోకలు సాగిస్తూనే ఉంటాయి. మున్సిపల్, పోలీస్ అధికారులు రోడ్డు ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సమస్య పరిష్కరిస్తాం



పాఠశాలలు ప్రారంభమయ్యేలా జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం. రోడ్డుపై వాహనాలు నిలిపేవారితో పాటు, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకొని జరిమానా విధిస్తాం. మున్సిపల్ అధికారులతో మాట్లాడి సిగ్నల్స్ పనిచేసేలా చూస్తాం. ప్రజలు కూడా సహకరించాలి.

–అనిల్‌కుమార్, పట్టణ సీఐ

విడతల వారీగా చర్యలు



ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే ఆటంకాలపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలుమార్లు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి అవగాహన కల్పించాం. పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తీయించేస్తాం. విడతల వారీగా రోడ్డు ఆక్రమణలపై చర్యలు చేపడతాం.

–సీవీఎస్ రాజు, మున్సిపల్ కమిషనర్

సిగ్నల్స్ పనిచేయక సమస్యలు



నిర్మల్‌లోని ఈద్గాం, అంబేద్కర్ చౌక్, వివేక్‌చౌక్, జయశంకర్ చౌరస్తాలో సిగ్నల్స్ పని చేయక ట్రాఫిక్ స్తంభిస్తుంది. మరో 15 రోజుల్లో పాఠశాలలు ప్రారంభమవుతాయి. వెంటనే సిగ్నళ్లకు మరమ్మతులు చేయించాలి.

– రమేశ్, నిర్మల్

ఆక్రమణలపై దృష్టి సారించాలి



జిల్లా కేంద్రంలో కొందరు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో సదరు దుకాణాల వద్ద వాహనాలను రోడ్డుపై నిలపాల్సి వస్తుంది. రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డు ఆక్రమణలపై దృష్టి సారించాలి.

– రంజిత్, నిర్మల్



ఈద్గాం చౌరస్తాలో సిగ్నల్స్ పనిచేయకపోవడంతో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

'పెండింగ్ బిల్లులు చెల్లించండి'

లోకేశ్వరం: గ్రామాల్లో తాజా మాజీ సర్పంచ్‌లు పదవిలో ఉన్నప్పుడు చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూజంగరావు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యలయంలో బుధవారం మాట్లాడారు. గత ప్రభుత్వం అగమేఘాలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించి వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులపాలయ్యామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. బిల్లులు చెల్లించే వరకు ఎన్నికలు నిర్వహించొద్దని కోరారు.

సీడీపీవో పర్యటన



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో సరిత

ఖానాపూర్: మండలంలోని అడవిసారంగాపూర్‌లో బుధవారం గ్రామ ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ సీడీపీవో సరిత పర్యటించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. చిన్నారుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లత, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

యూనిఫాం క్లాత్ సరఫరా

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న సర్కారు పాఠశాలల విద్యార్థుల యూనిఫాంల కోసం ప్రభుత్వం క్లాత్ సరఫరా చేసినట్లు ఎంఈవో చంద్రకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి యూనిఫాం తీసుకెళ్లాలని సూచించారు. మండలంలోని పాఠశాలల్లో 4,150 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి జయంతి



భైంసాలో ఆలయంలో భక్తుల పూజలు



దస్తురాబాద్‌లో..



కడెం: హోమంలో పాల్గొన్న భక్తులు



కుంటాలలో కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భైంసాటౌన్: పట్టణంలో బుధవారం లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నర్సింహనగర్‌లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ సమీపంలోని పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అష్టోత్తర పూజ, హోమం, అభిషేకం నిర్వహించినట్లు అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదం స్వీకరించారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని అర్చకులు కొండామాచార్యుల ఆధ్వర్యంలో జరిపించారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం ఘనంగా జరిపించారు. ఉదయం మంగళహారతి, అభిషేకం, అష్టోత్తర శతనామావళి, హారతి, కల్యాణం, ఆశీర్వచనం, ప్రసాద వితరణ, నిర్వహించారు. అర్చకులు రామానుజదాస్, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువు తయారు చేయాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుభీర్: గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయించాలని సూచించారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయించడంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షించాలన్నారు. పారిశుధ్య పనులు చేసి.. తాగునీటికి ఇబ్బంది కలకుండా చూడాలన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాలు, ట్రాక్టర్ కిస్తులను సకాలంలో చెల్లించాలని సిబ్బందికి సూచించారు. భైంసా డీఎల్‌పీవో మొజిబ్ హుస్సేన్, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. అంతకుముందు గోడాపూర్, హంపోలి గ్రామాల నర్సరీలను పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ వినయ్ బాబు.

నర్సాపూర్ (జి): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వినయ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని నర్సాపూర్(జి), రాంపూర్, నందన్ డీసీఎంఎస్ కేంద్రాలు, రాంపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలన్నారు. మిల్లులకు సకాలంలో ధాన్యం తరలించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు భాగ్యలక్ష్మి, రమ్య, ఐకేపీ సీసీ ముత్యం, సెంటర్ నిర్వాహకులు గడ్డం రమేశ్‌రెడ్డి, నడిపొల్ల రవి, నార్వాడే ప్రవీణ్ , రైతులు పాల్గొన్నారు.

స్థానికసంస్థల ఎన్నికలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

లక్ష్మణచాంద: ప్రతి ఒక్కరు ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్సై శ్రీకాంత్ సూచించారు. బుధవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో స్థానికసంస్థలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

16వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న హరికృష్ణ

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన హరికృష్ణ అనే ప్రైవేటు అధ్యాపకుడు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. బుధవారం నిర్మల్ ఏరియా ఆసుపత్రిలో నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన ఓ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. విషయం తెలిసి వెంటనే స్పందించిన హరికృష్ణ నిర్మల్ ఏరియా ఆసుపత్రికి వెళ్లి రక్తం ఇచ్చి మహిళను ఆపద నుండి కాపాడారు. ఇప్పటివరకు 16 సార్లు రక్తదానం చేసినట్లు అతడు తెలిపాడు.

రోడ్లను శుభ్రం చేయాలి

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామ పంచాయతీలో బుధవారం ఎంపీడీవో సోలమాన్‌రాజ్ పర్యటించారు. ఈసందర్భంగా పంచాయతీ రికార్డులు, నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్డు, వర్మీకంపోస్టు ఎరువులతయారీ పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మురికి కాలువలను శుభ్రం చేయడంతోపాటు రోడ్లపై చెత్తదారం లేకుండా చూడాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా సకాలంలో నీరందించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రఘువేందర్ ఉన్నారు.

సదర్‌బోనాల పండుగ



ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లిలో బుధవారం సదర్ బోనాల పండుగ నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవంలో భాగంగా డప్పుచప్పుళ్ల నడుమ బోనాలు ఎత్తుకొని పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. ఊరేగింపులో బైండ్లోళ్ల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరెంట్ సౌకర్యం లేక చెట్టు కింద టీకాలు



చెట్టు కింద టీకా వేస్తున్న ఏఎన్‌ఎం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రతి బుధవారం 10ఏళ్ల లోపున్న చిన్నారులకు వివిధ రకాల టీకాలను ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇస్తుంటారు. ఆరోగ్య ఉపకేంద్రానికి విద్యుత్ కనెక్షన్ లేదు. దీంతో ఉక్కపోత భరించలేక సిబ్బంది పక్కనున్న హనుమాన్ ఆలయం చెట్టు కింద చిన్నారులకు టీకాలు వేస్తూ తమ డ్యూటీని కొనసాగించారు. కరెంటు కనెక్షన్ ఏర్పాటు చేయాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు కోరుతున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



అంబకంటిలో పరిశీలిస్తున్న ఎంపీడీవో రహీం

కుంటాల: మండలంలోని అంబకంటి, అంబకంటి తండాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీవో ఎంఏ రహీం పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠ ధామంతోపాటు రాయపాడ్ తండాలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఉత్తం, సతీశ్ ఉన్నారు.

'దొడ్డు రకాలకు బోనస్ ఇవ్వాల్సిందే'



నిరసనలో బీఆర్‌ఎస్ నేతలు, రైతులు

ఖానాపూర్: ఎన్నికల వేళ వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక కేవలం సన్నరకం వడ్లకే బోనస్ ఇస్తామని నిర్ణయించడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ పిలుపుమేరకు పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదుట బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇచ్చిన హామీని అమలు చేయకుంటే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజగంగన్న, రామునాయక్, అబ్దుల్ కలీల్, గౌరికార్ రాజు, ప్రదీప్, లింగన్న, బీసీరాజన్న, మురళి, సుమిత్, చంద్రహాస్, శేఖర్, సుమన్, మహేందర్, భీమన్న తదితరులు ఉన్నారు.

వేధిస్తే 100కు డయల్ చేయండి



అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

నిర్మల్‌టౌన్: వేధింపులకు గురైతే ఆందోళన చెందకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550 కు ఫోన్ చేయాలని సూచించారు. ఇందులో షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులతో పైలంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో మనీషా

ఖానాపూర్: వానాకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమైనందున రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోలులో పైలంగా ఉండాలని ఏఈవో మనీషా అన్నారు. బుధవారం మండలంలోని పాతతర్లపాడ్‌లో పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొంటే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, రాకేశ్, శంకర్, లత, వెంకవ్వ, రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.